ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 23 జనవరి 2024

వైసీపీకి షర్మిల ఫోబియా

రక్తం పంచుకుని పుట్టిన అన్నాచెల్లెలు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ షర్మిల రాజకీయ ప్రత్యర్థులుగా మారారు. నిన్నటివరకు షర్మిలను వైఎస్ షర్మిలగా ఆమోదించిన జగన్ అండ్ కో.. ఎప్పుడైతే ఆమె కాంగ్రెస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై విరుచుకుపడ్డారో.. అప్పుడే ఇటు ఎమ్మెల్యేలు, అటు వైసీపీ పేటీఎం బ్యాచ్ సోషల్ మీడియాలో షర్మిలపై ఎదురు దాడికి దిగుతూ ఆమె వ్యక్తిత్వాన్నే కించపరిచేలా పోస్టులు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. సొంత మేనమామ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి లేని పార్టీకి ప్రెసిడెంటా.. అని ఎద్దేవా చేస్తే, ఇక ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కూడా విమర్శలు చేశారు. దీన్ని బట్టి చూస్తే షర్మిలను చూసి వైసీపీ భయపడుతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.

- (కడప-ఆంధ్రజ్యోతి)





- పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే నేరుగా జగన్‌పై అటాక్
- మణిపూర్ ఘటనపై ఎందుకు మాట్లాడలేదంటూ షర్మిల ఆగ్రహం
- క్రైస్తవుల ఓట్లు దూరమవుతాయని వైసీపీలో ఆందోళన
- వెంటనే.. సోషల్ మీడియాలో షర్మిలపై పేటియం బ్యాచ్ అటాక్
- కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాజీమంత్రి అహ్మదుల్లా
- మరికొందరు మాజీ నేతలు అదే బాటలో..?

ఓట్లకు గండిపడుతుందన్న భయం

మైనార్టీల్లో ముఖ్యంగా క్రైస్తవులు, ముస్లింల ఓట్లు కాంగ్రెస్‌కు సంప్రదాయకంగా ఉన్నాయి. ఆ వర్గాలు కడప జిల్లాలో బలంగా ఉన్నారు. వైఎస్ హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చారు. ఆ వర్గం ఓటర్లు కాంగ్రెస్‌ను ఆదరిస్తూ వచ్చేవారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ దెబ్బతింది. ఆ వర్గాల్లోని కొంతమంది ఓటర్లు జగన్ వెంట నడిచారు. 2014-19 ఎన్నికల్లో ఆదరించారు. అయితే కాంగ్రెస్‌లోకి షర్మిల రాకతో నూతనంగా ఊపిరి పోసినట్లయింది. నిన్నటి వరకు షర్మిల వైఎస్ జయంతి, వర్ధంతి, క్రిస్మస్ వేడుకలకు వచ్చినప్పుడల్లా నిరాడంబరంగానే ఇడుపులపాయ వెళ్లేవారు. పీసీసీ చీఫ్‌గా నియమించిన తరువాత బాధ్యతలు చేపట్టడానికి ముందురోజు షర్మిల ఇడుపులపాయ వచ్చినప్పుడు ఆమెకు కడప విమానాశ్రయం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీ స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగానే మాజీమంత్రి అహ్మదుల్లా తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. 2004-09 ఎన్నికల్లో అహ్మదుల్లా కడప నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మైనార్టీ మంత్రిగా పనిచేశారు. కడప అసెంబ్లీ నియోజకవర్గంలో మైనార్టీల ఓట్లు కీలకంగా ఉన్నాయి.

ఆ వర్గం ఓట్లు దూరమవుతాయని..

కాంగ్రెస్‌లో షర్మిల చేరికతో జిల్లాలో ముస్లిం, క్రైస్తవ ఓట్లు ఎక్కడ దూరమవుతాయో అనే భయం వైసీపీలో ఉన్నట్లు చెబుతున్నారు. మోదీతో జగన్ అంటకాగుతుండటం కొందరు ముస్లింలు జీర్ణించుకోలేక పోతున్నారు. కేంద్రం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకు అడగకుండానే వైసీపీ మద్దతు ఇస్తోందని ముస్లింలు ఆగ్రహంతో ఉన్నారు. ఇక మణిపూర్ అల్లర్ల ఘటన కొందరు క్రైస్తవులను మనోవేదనకు గురిచేస్తున్నట్లు చెబుతారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై సీఎం జగన్ ఎందుకు స్పందించలేదంటూ షర్మిల ప్రశ్నించడంతో వైసీపీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయంటారు. జగన్‌ను క్రైస్తవుడిగా భావించి ఆ వర్గం ఓట్లను గంపగుత్తగా వేసి గెలిపిస్తున్నారు. అయితే మణిపూర్ ఘటనపై షర్మిల చేసిన వ్యాఖ్యలు క్రైస్తవుల్లో హాట్ టాపిక్‌గా మారింది. వీరంతా తిరిగి కాంగ్రెస్ వైపు తిరిగితే జగన్ పార్టీకి చిల్లు పడుతుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

షర్మిల వెంట నడిచేదెవరో

కడపకు చెందిన మాజీ మంత్రి అహ్మదుల్లా తిరిగి సొంతగూటికి చేరారు. ఆయన 2004-09 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచారు. మైనార్టీ మంత్రిగా పనిచేశారు. రెండురోజుల క్రితం షర్మిల ఇడుపులపాయకు వచ్చిన రోజున ఆమె సమక్షంలో అహ్మదుల్లా కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు షర్మిల వెంట నడుస్తారనే చర్చ నడుస్తోంది. వైసీపీ, టీడీపీలో టికెట్లు రాని నేతలు షర్మిల వెంట నడిచే అవకాశం ఉందని చెబుతున్నారు. షర్మిల కూడా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. ఇందులో భాగంగానే పీసీసీ హోదాలో సొంత గడ్డపై త్వరలో అడుగు పెట్టనున్నారు. అప్పుడు మరికొందరు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందంటున్నారు.

ఎదురు దాడి

షర్మిల బాధ్యతలు చేపట్టక ముందే మేనమామ ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి "రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జీరో.. నామ్‌కే వాస్తే పార్టీల్లో కాంగ్రెస్ ఒకటి.. లేని పార్టీకి ప్రెసిడెంటా" అని ఎద్దేవా చేశారు. లేని పార్టీకి షర్మిల ప్రెసిడెంటు అయినప్పుడు విమర్శించాల్సిన అవసరం ఏముందంటూ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూతురుగా షర్మిలకు జనాల్లో ప్రత్యేక మార్కు ఉంది. తండ్రి హావభావాలు షర్మిలలో కనిపిస్తాయి. రాష్ట్రంలో జగన్‌పై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విమర్శలకన్నా షర్మిల విమర్శలు వైసీపీకి నష్టం చేకూరుస్తాయని ఆ పార్టీ నేతలు కలవరపడుతున్నట్లు చెబుతున్నారు. అక్రమాస్తుల కేసులో జగన్ జైలుకు వెళ్లినప్పుడు షర్మిల పాదయాత్రచేసి పార్టీని నిలబెట్టారు. ఆ కృతజ్ఞత వైసీపీలోని కొందరిలో ఇంకా ఉంది. అయితే షర్మిలపై పేటీయం బ్యాచ్, తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాల మేరకు కొందరు విమర్శలు చేస్తున్నారంటారు. ఇందులో భాగంగానే జిల్లా నుంచి షర్మిలపై ఎమ్మెల్యేలు రవిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి విమర్శలు గుప్పించారంటారు. కాంగ్రెస్ చీఫ్ కాక ముందు ఆమెను వైఎస్ షర్మిలగా ఆదరించిన వైసీపీ, సోషల్ మీడియా బ్యాచ్.. కాంగ్రెస్ చీఫ్ అయిన తరువాత భర్త ఇంటి పేరును తగిలిస్తూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. దీన్నిబట్టి చూస్తే షర్మిలకు భయపడుతున్నారన్న సిగ్నల్‌ను వైసీపీయే జనాల్లోకి పంపిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అంగన్వాడీలపై ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్న అఖిలపక్ష నేతలు



అంగన్వాడీల తొలగింపు చెల్లదు

- ప్రభుత్వాల మెప్పుకోసం సివిల్ సర్వెంట్లు తప్పుచేస్తున్నారు
- అఖిలపక్ష కమిటీ సమావేశంలో నేతలు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 22: అంగన్వాడీలను తొలగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు చట్టబద్ధంగా చెల్లవని, ఈ విషయం తెలిసినా ప్రభుత్వాల మెప్పుకోసం సివిల్ సర్వెంట్లు తప్పులు చేస్తున్నారని అఖిలపక్ష నేతలు పేర్కొన్నారు. కలెక్టర్లపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకున్నట్టే అంగన్వాడీల వ్యవహారంలోనూ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రంలోని 1,06,000 మంది అంగన్వాడీలు 42 రోజులుగా కనీస వేతనాల కోసం, అద్దె బకాయిల కోసం, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమానపనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు కోసం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ సమ్మెచేస్తున్నారు. అయితే వీరి డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోగా ఐసీడీఎస్ అంగన్వాడీ స్కీం వర్కర్లను సోమవారం వేలాదిమందిని టెర్మినేషన్ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కడప పాత బస్టాండులోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన జిల్లాలోని అఖిలపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా సీపీఎం, సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, లోక్‌సత్తా, సీపీఐ, జనతాదళ్, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల నేతలు మాట్లాడారు.

ఐసీడీఎస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి పర్యవేక్షణలో నడుస్తున్న వ్యవస్థ అని అన్నారు. వీరు ప్రభుత్వ ఉద్యోగులు కాదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయని అందుకే అంగన్వాడీ కార్మికులు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమ్మె చేస్తున్నారని అన్నారు. అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు కాదని చెబుతూనే వీరిపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడం చట్టబద్ధంగా చెల్లదన్నారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా అవసరమైతే అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్రబంద్‌కు పిలుపు ఇస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏ సత్తార్, జనతాదళ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా పార్టీ నాయకులు క్రిష్ణ, సీపీఐ లిబరేషన్ నాయకులు రమణయ్య, సీపీయం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐఎన్ సుబ్బమ్మ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కాన్వాయ్‌ని అడ్డుకోవడం పిరికిపంద చర్య

- అంగన్వాడీలపై ప్రభుత్వ చర్యలు దుర్మార్గం
- తులసిరెడ్డి ధ్వజం

వేంపల్లె, జనవరి 22: ఏపీసీసీ అధ్యక్షురాలుగా వైఎస్ షర్మిల ఆదివారం విజయవాడలో ప్రమాణస్వీకారం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కాన్వాయ్‌ని రాష్ట్ర పోలీసులు అడ్డుకోవడం, దారి మళ్లించడం పిరికిపంద చర్య అని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఉనికే లేదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభమైందన్నారు. ప్రత్యేక హోదాకు కాంగ్రెస్ ప్రభుత్వం చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని సజ్జల ప్రశ్నించడం అజ్ఞానమన్నారు. ప్రత్యేక హోదా అమలుకు చట్టం అవసరం లేదని, ఎగ్జిక్యూటివ్ ఆర్డరు మాత్రమే చాలన్నారు. 1 మార్చి 2014న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ వచ్చినప్పటికీ అమలు కాలేదన్నారు. కోడికత్తి కేసులో జగన్ సాక్ష్యం చెప్పేందుకు కోర్టుకు పోని కారణంగా శ్రీను ఐదేళ్లుగా జైలులో మగ్గిపోవడం అమానుషమన్నారు. గత 42దినాలుగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించకుండా వారిపై ఎస్మా ప్రయోగించడం, బెదిరించడం, కేసులు పెట్టడం, దుర్మార్గమన్నారు.

రేపు అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్), జనవరి 22: తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల గిరిప్రదక్షణకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని వివిధ డిపోల నుంచి 24వ తేదీ బుధవారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు త్వరితగతిన సీట్లు బుకింగ్ చేసుకోవాలని ఆయన కోరారు.

- కడప డిపో నుంచి బుధవారం రాత్రి 9 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు (సర్వీస్‌నెంబర్-6001) బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలానికి చేరుతుంది. టికెట్ ధర రూ.1,072.
- బద్వేల్ డిపో నుంచి ఉదయం 7 గంటలకు అల్ట్రాడీలక్స్ బస్సు (9569) బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకోనుంది. ఇందులో టికెట్ ధర రూ.1,475. మరో సూపర్‌లగ్జరీ బస్సు (60009) ఉదయం 7 గంటలకు బద్వేల్ నుంచి బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుంది. టికెట్ ధర రూ.1566
- మైదుకూరు డిపో సూపర్ లగ్జరీ బస్సు (97876) పోరుమామిళ్ల నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుంది. టికెట్ ధర రూ.1,414. మరో సూపర్‌లగ్జరీ బస్సు (95678) సాయంత్రం 6 గంటలకు మైదుకూరు డిపో నుంచి బయలుదేరి కడప మీదుగా వెళుతుంది. టికెట్ ధర రూ.1,414,
- ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 8-30 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు (9944) బయలుదేరి మైదుకూరు, కడప మీదుగా వెళుతుంది. టికెట్ ధర రూ.1,273.
- జమ్మలమడుగు డిపో నుంచి రాత్రి 8 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు (98398) బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుంది. టికెట్ ధర రూ.1,352
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు (59900) బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుంది. టికెట్ ధర రూ. 1,242.





16,16,509 మంది

- మహిళా ఓటర్లు 8,25,177 మంది
- పురుషులు 7,91,108, ట్రాన్స్‌జెండర్లు 224 మంది
- తుది జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం

త్వరలో జరగనున్న సాధారాణ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాకు సంబంధించి తుదిఘట్టం ముగిసింది. ఓటరు జాబితాపై అభ్యంతరాలు పరిశీలించి దిద్దుబాట్లు, సర్దుబాట్లు చేసి ఎట్టకేలకు రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లాలో 16,16,509 మంది ఓటర్లున్నట్లు నిగ్గుతేల్చింది. అయితే ఈ దఫా మహిళ ఓటర్ల ఆధిక్యం పెరిగింది. పురుష ఓటర్ల కంటే దాదాపు 34,069 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

కడప(కలెక్టరేట్), జనవరి 22: జిల్లాలోని కడప పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల తుది జాబితాను కలెక్టర్ విజయరామరాజు సోమవారం విడుదల చేశారు. జిల్లాలో 16,16,509 మంది ఓటర్లుండగా అందులో పురుష ఓటర్లు 7,91,108 మంది, మహిళా ఓటర్లు 8,25,177 మంది, ట్రాన్స్‌జెండర్లు 224 మందితో పాటు సర్వీసు ఓటర్లు 2,378 మంది ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా ప్రొద్దుటూరులో పురుషులకంటే మహిళా ఓటర్లు 7,315 మంది అధికంగా ఉన్నారు. జమ్మలమడుగులో 6,684 మంది, కడపలో 6,353మంది, పులివెందులలో 5,776 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మైదుకూరు, బద్వేలు, కమలాపురం నియోజకవర్గాల్లోనూ 3 వేల నుంచి 4 వేల వరకు మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

అభ్యంతరాలపై 4,23,307 దరఖాస్తులు

ఏడాది క్రితం నుంచే కొన్ని నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ నాయకులు ఓటర్లకు సంబంధించి కుయుక్తులు పన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ జరగని విధంగా ఓటర్ల తొలగింపు, అనర్హుల చేర్పులు, అభ్యంతరాలకు సంబంధించి ఫారం 6, 7, 8 దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. ఇవన్నీ కలిపి 25శాతం అంటే 4,23,307 వచ్చాయంటే ఆషామాషీ కాదనే చెప్పవచ్చు. ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో గత ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్నా ఈ దఫా ఎన్నికల నాటికి ఓటు ఉంటుందో లేదో అనే సందేహాలు అందరిలో నెలకొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ నేతల తప్పుడు విధానాలు, కొందరు అధికారులు అత్యుత్సాహంతో పెద్దఎత్తున దొంగ ఓట్లను చేర్చడం, వైసీపీకి అనుకూలంగా లేనివారిని ఓట్లను తొలగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార పార్టీ ఆగడాలను పసిగట్టిన టీడీపీ నేతలు ఓటరు జాబితాలో అవకతవకలపై ఎన్నికల సంఘానికి పెద్దఎత్తున ఫిర్యాదులు చేశారు. జిల్లాలో సైతం కొన్నిచోట్ల బీఎల్వోల మొదలు ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వరకు అధికార పార్టీ నేతల ఉచ్చులో పడి ఎన్నికల సంఘానికి చిక్కి సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే.

గడువు పెంపుతో..

ఈ నెల 5న ఓటర్ల తుది జాబితా ప్రచురణ జరగాల్సి ఉంది. అయితే ఓటరు జాబితాపై అభ్యంతరాలు వెల్లువెలుత్తడంతో ఓటర్ల తుది జాబితా ప్రకటనను ఎన్నికల కమిషన్ ఈనెల 22 వతేదీకి మార్చింది. ఈనెల 5 వ తేదీ నాడు తుది జాబితా ప్రకటన జరిగి ఉంటే జిల్లాలో ఓటర్ల సంఖ్య 16,13,479 మంది కాగా, గడువు పెరగడంతో మరో 3,030 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు పొందారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీసుఓటర్లు
కడప	2,74,226	1,33,890	1,40,248	88	86
బద్వేలు	2,17,769	1,08,673	1,09,089	7	971
పులివెందుల	2,27,453	1,10,829	1,16,605	19	403
కమలాపురం	2,00,222	98,037	1,02,151	34	230
జమ్మలమడుగు	2,40,835	1,17,067	1,23,751	17	268
ప్రొద్దుటూరు	2,46,726	1,19,680	1,26,995	51	143
మైదుకూరు	2,09,278	1,02,932	1,06,338	8	277
మొత్తం	16,16,509	7,91,108	8,25,177	224	2,378

ఎన్నికలకు సంసిద్ధం కావాలి : కలెక్టర్

- కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), జనవరి 22: రానున్న ఎన్నికలకు ముందస్తుగా సంసిద్ధం కావాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ఎన్నికలు, ఆడుదాం ఆంధ్ర, కులగణన, గడప గడపకు మన ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, పోలింగ్ సిబ్బందికి సంబంధించి వివరాల సేకరణ పూర్తిచేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కులగణన వందశాతం పూర్తి చేయాలని, ఆరోగ్యశ్రీ, హెల్త్‌కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ప్రత్యూష, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

25న జాతీయ ఓటర్ల దినోత్సవం

ఈనెల 25 వతేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలను అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పనలో భాగంగా జిల్లాలో జరిగిన వివిధ కార్యకలాపాలు, ఫారం-6, 7, 8లకు సంబంధించి పరిష్కారాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను రాజకీయపార్టీల ప్రతినిధులకు వివరించారు. తాజాగా విడుదలైన తుది ఓటర్ల జాబితా ప్రచురణలకు సంబంధించిన పెన్‌డ్రైవ్‌లను వారికి అందజేశారు.

ఈ సమావేశంలో జేసీ గణేశ్‌కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యంతోపాటు సంక్షేమం జరగాలి

- అభివృద్ధి నిరోధకుడు జగన్
- మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, జనవరి 22: ప్రపంచంలో మత సామరస్యంతోపాటు సంక్షేమం జరగాలని, అయోధ్య రాముని ఆశీస్సులతో రాష్ట్రంలో పన్నుల భారం లేకుండా రామరాజ్యం రావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సి.ఆదినారాయణరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం జమ్మలమడుగులో ఆయన పలు రామాలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం వల్లంకొండు కోదండరామ స్వామి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా పూజలు నిర్వహించామన్నారు. సుమారు 500 సంవత్సరాల నుంచి సమస్య ఉండేదని అది సామరస్యంగా పరిష్కారమై ఆలయం రూపుదిద్దుకుందన్నారు. ప్రజాస్వామ్యంలో మత సామరస్యంతోపాటు సంక్షేమంలో భాగంగా విద్య, వైద్యం, ఆరోగ్యం, రోడ్లు, సంక్షేమం, ఉపాధి, నిరుద్యోగ సమస్య లేకుండా, పన్నుల భారం లేకుండా ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం ఘోరాతిఘోరంగా మారిపోయిందన్నారు. ఎక్కడ చూసినా భూ కబ్జాలు, ఇసుక దోపిడీ, బెదిరింపులు, విమర్శిస్తే కేసులు, రైతులకు కరువు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఏ సమస్యలు పట్టడంలేదని, చివరకు కరువు మండలాలు కూడా ప్రకటించకుండా వైసీపీ పాలనలో జగన్ నియంతగా మారాడన్నారు. విమర్శిస్తున్న పత్రికలను పక్కనబెట్టాలని ఆయన చెప్పడం దారుణమన్నారు. గండికోటలో రోప్‌వే ఏర్పాటు చేసి ఉంటే పర్యాటకులు తిరిగేవారన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి రెండుసార్లు పూజలు చేసి పట్టించుకోలేదన్నారు. అన్ని అనుమతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినా స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో విఫలం అయ్యారన్నారు. ఆరు నెలల క్రితం ఒబెరాయ్‌ను తెచ్చి హోటళ్లని అన్నారని తర్వాత దాని ఊసేలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.రాజేశ్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు శరణా వెంకటకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం

కడప (కల్చరల్), జనవరి 22: అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం అనేలా... అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా అంతా రామమయంగా మారింది. ఊరూరా.. వాడవాడనా శ్రీరామనవమి పర్వదినాన్ని తలపించేలా ప్రజల్లో ఆనందం పెల్లుబికింది. శ్రీరాముని ఆలయాలకు ప్రజలు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు పానకాలు, వడపప్పు, అన్నదానం ఏర్పాటుచేశారు. కాగా.. అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా ప్రజలు వీక్షించేందుకు వీలుగా జిల్లాలోని ప్రధాన పట్టణాల కూడళ్లలో ప్రత్యేక స్ర్కీన్‌లు ఏర్పాటుచేశారు. కడప నగర శివారులోని పాలకొండపై సాయంత్రం ఆఖండ జ్యోతి వెలిగించారు. మృత్యుంజయకుంట శివాలయంలో భక్తులు దీపాలు 'శ్రీ రామ' పేరుతో దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.



మృత్యుంజయకుంట శివాలయం వద్ద దీపాల కాంతులు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, పోలీసు సిబ్బంది... సుహాసిని(ఫైల్)

ఒంటిమిట్ట, జనవరి 22: స్థానిక నడివీధి గంగమ్మ వీధిలో నివాసం ఉంటున్న సంకు సుహాసిని (42) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానిక పోలీసుల వివరాలు మేరకు.. భార్య భర్తలు ఇరువురు గత రాత్రి ఘర్షణ పడ్డారు. అనంతరం ఇరువురు ఇంటిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో భార్య ఇంటి నుంచి వెళ్లి పోయి కనిపించడం లేదని భర్త సుబ్బారావు ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను విచారించారు. కాగా, మహిళ మృతి అనుమానాస్పదంగా ఉందని.. కుమారుడు మనోజ్ ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని సీఐ పురుషోత్తమరాజు తెలిపారు.మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు. దీనిపై అనుమానాస్పద కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఆయన తెలిపారు.

రైలులో నుంచి జారిపడి యువకుడు మృతి

కొండాపురం, జనవరి 22: మండలంలోని రేగడిపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున తిరుపతికి వెళుతున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో నుంచి జారిపడి మహారాష్ట్రకు చెందిన యువకుడు మృతి చెందాడు. లాతురుకు చెందిన సంజయ్ భీమ్‌రావ్ దేశ్‌ముఖ్(26) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఆయన పేర్కొన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.23 లక్షల నగదు స్వాధీనం

ప్రొద్దుటూరు, జనవరి 22: పట్టణంలోని మైదుకూరు రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంక్‌వద్ద వాహనాల తనిఖీల్లో రూ.23 లక్షల నగదును రూరల్ ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం రూరల్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రొద్దుటూరు నుంచి పులివెందులకు కారులో వెళుతున్న ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి రూ.23 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు ఎలాంటి బిల్లులు, రసీదులు లేకపోవడంతో పులివెందుల పట్టణానికి చెందిన రఘువీరారెడ్డి వద్ద నుంచి రూ.9.50లక్షలు, షేక్ ఇంతియాజ్ నుంచి రూ.7.50 లక్షలు, చింతకొమ్మదిన్నెకు చెందిన షేక్ అమీన్ నుంచి రూ.6 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.. ఈ నగదును తిరుపతి ఐటి అధికారులకు పంపిస్తామని తెలిపారు.

ముచ్చుమర్రి వద్ద రూ. 9.7 లక్షలు..



సీజ్ చేసిన నగదును చూపుతున్న ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, ఎస్ఐ యోగీంద్ర

కొండాపురం, జనవరి 22 : మండలంలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు రూ.9,70,000 నగదు సీజ్ చేశారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, కొండాపురం ఎస్ఐ యోగీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదును స్వాధీనపరచుకున్నారు. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి గ్రామానికి చెందిన నరసింహులు అనంతపురం నుంచి నెల్లూరుకు కారులో ఈ మొత్తాన్ని తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు డీఎస్పీ, ఎస్ఐలు తెలిపారు. నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు వారు పేర్కొన్నారు.

కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద ...

కొండాపురం మండలంలోని జిల్లా సరిహద్దుల్లోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి పోలీసులు రూ.3.15 లక్షల నగదు సీజ్ చేశారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. తాడిపత్రి నుంచి తాళ్లప్రొద్దుటూరుకు కారులో వెళుతున్న చెన్నా సూర్యనారాయణ అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

30 తులాల బంగారు, ఏడున్నర లక్షలు...

బద్వేలు టౌన్, జనవరి 22: పట్టణంలోని పలు రహదారుల్లో సోమవారం రూరల్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో ఒక వాహనంలో 30 తులాల బంగారం, మరో వాహనంలో ఏడున్నర లక్షల నగదు గుర్తించారు. ఈ నగదు, బంగారానికి సంబంధించి ఎలాంటి బిల్లులు, పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆటోను ఢీకొన్న కారు

● నలుగురు మహిళలకు గాయాలు

బద్వేలు రూరల్, జనవరి 22: మండల పరిధిలోని నక్కలగండి సమీపంలో ఆటోను కారు ఢీకొన్న ఘటనలో నలుగురు మహిళలు గాయపడ్డారు. వివరాలిలా.. బి.కోడూరు మండలం అక్కుపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ మహిళా కూలీలు బద్వేలు మండలం నక్కలగండి గ్రామ సమీపంలో పొలాల వద్దకు కూలీ పనులకు వెళుతున్నారు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఆటో వెనుక భాగంలో ఢీకొట్టడంతో హజరతమ్మ, సుభాన్‌బీ, గురమ్మ, రసూల్‌బీ అనే నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హజరతమ్మ, రసూల్‌బీలను కడపకు తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

28 మద్యం బాటిళ్లు స్వాధీనం

కడప (క్రైం), జనవరి 22 : కడప నగరంలోని ఆర్టీసీ కాలనీ రోడ్డులో ఓల్డ్ బైపాస్ రోడ్డు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి 28 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌకు ఎస్ఐ పి.రవికుమార్ తెలిపారు. నిందితుడు స్వప్న బార్ అండ్ రెస్టారెంటు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడన్నారు. ఆ మేరకు అతన్ని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

సికెదిన్నె, జనవరి 22: కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ గాయపడినట్లు అగ్నిమాపక అధికారి తెలిపారు. గువ్వలచెరువు ఘాట్ 4వ మలుపు వద్ద ఆగి ఉన్న ట్రాలీ లారీని వెనుకవైపు మరో కంటైనర్ ఢీకొనడంతో లారీ క్యాబిన్‌లో డ్రైవర్ కాళ్లు ఇరుక్కుపోయి తీవ్ర గాయా లయ్యాయి.

వెంటనే సమాచారం అందుకున్న కడప అగ్నిమాపక సిబ్బం ది ఘటనా స్థలానికి చేరుకుని హైడ్రాలిక్ కట్టర్ సహాయంతో సురక్షితంగా బయటకు తీసి అంబులెన్స్‌లో తరలించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ అన్వర్‌బాష, సంజీవరాయుడు, డ్రైవర్ గంగాధర్‌యాదవ్, ఫైర్‌మెన్ మురళీకృష్ణ, రమేష్‌నాయుడులు పాల్గొన్నారు.

బద్వేలులో గంజాయి గ్యాంగులు

- విశాఖ, కడపల నుంచి సరుకు
- లక్షల్లో వ్యాపారం
- మత్తుకు బానిసలవుతున్న యువత



బద్వేలు, జనవరి 22: మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టడంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు వీరి చేష్టల ముందు బలాదూర్ అవు తున్నాయి. గుట్కా, ఖైనీ, రాజా, గంజాయి లాంటి మత్తు పదార్థాల విక్ర యాలు జోరుగా సాగుతున్నాయి. బద్వేలు పట్టణంలో గ్యాంగులుగా ఏర్ప డి గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం. గంజాయి విక్ర యాలు విచ్చలవిడిగా జరుగుతుండడంతో వీటికి అలవాటుపడ్డ వారితో పాటు కొత్తగా యువత కూడా ఈ వ్యసనానికి బానిసలవుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి చాలా రహస్యంగా తీసుకువచ్చి.. చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. వీటిని అరికట్టేందుకు అప్పుడపుడు దాడులు జరుగుతున్నా ఇవేవి గంజాయి గ్యాంగుల ముందు పనిచే యడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

విశాఖ, కడప నుంచి....?:

పట్టణంలో విక్రయిస్తున్న గంజాయిని విశాఖపట్టణం అలాగే కడప నగరం నుంచి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ మొత్తంలో కొందరు విశాఖ పట్నం నుంచి తెస్తుండగా కొందరు కడప నుంచి తీసుకువస్తున్నట్లు సమాచారం. కడపలోని మోచంపేట ప్రాంతం నుంచి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయిని చిన్న చేతి సంచులు, ప్యాంటు జేబులలో తీసుకువచ్చి వారికి అవసరమైన చోట విక్రయించడం జరుగుతుంది. అలాగే కొన్ని ప్రాంతాలలో స్థావరాలు ఏర్పాటు చేసుకుని అక్కడ రహస్యంగా విక్రయిస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. ఖాళీ సిగరెట్ ప్యాకెట్లలో గంజాయిని నింపి ఒక్కో ప్యాకెట్ రూ.300 వరకు విక్రయిస్తు న్నారని తెలుస్తోంది. గంజాయిని పీల్చేవారు కూడా సిగిరెట్లలోని పొగాకు తొలగించి వాటిలో గంజాయిని నింపుకుని తాగుతూ ఉంటారు. ఇలా పీల్చే వారిలో యువత ఎక్కువగా ఉన్నారు.

మత్తులో ఘర్షణలకు దిగుతున్న యువత

పట్టణంలోని మార్కెట్‌యార్డు మహమ్మద్ కాలనీ, పోరుమా మిళ్ల బైపాస్ రోడ్డు, చాంద్ థియేటర్ వెనుక ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికుల ద్వారా అందిన సమాచారం. గంజాయికి బానిసలైన వారు ఈ ప్రదేశాల్లో గుంపులుగా ఏర్పడి తాగడం, అల్లర్లకు పాల్పడడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గంజాయి విక్రయించే గ్యాంగులు పట్టణంలో 10 నుంచి 15 వరకు ఉన్న ట్లు సమాచారం. గంజాయికి, మద్యానికి బానిసైన యువకులు ఆ మత్తులో ఘర్షణలకు దిగి హత్యల వరకు వెళ్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి బద్వేలు పట్టణంలో గంజాయి విక్రయాలు అరికట్టేందుకు పోలీసు అధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాలి.

గంజాయి, అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు

పట్టణంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. గంజాయి, బెల్టుషాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. గంజాయి విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా గంజాయి విక్రయించినట్లు మా దృష్టికి తెస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం

-వెంకట మురళి, బద్వేలు ఎక్సైజ్ సీఐ

రామనామ స్మరణతో మార్మోగిన కోదండరామాలయం



కోదండరామున్ని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో ఉన్న భక్తులు

ఒంటిమిట్ట, జనవరి 22: కోదండరామాలయం భక్తుల రామనామస్మరణతో మార్మోగింది. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకొని కోదండరామాలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఉదయం నుంచి భక్తులతో రామాలయంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు ప్రసాదాలను పెద్దఎత్తున అందజేశారు. జిల్లా నలుమూలల నుండి ద్విచక్ర వాహనాలలో ర్యాలీగా కోదండరామాలయానికి భక్తులు చేరుకున్నారు. కడప నుంచి అడ్వకేట్లు బృందం రామనామ స్మరణతో ర్యాలీగా ఒంటిమిట్ట చేరుకొని చేరుకొని కోదండరామున్ని దర్శించుకున్నారు.

దర్శనం కోసం తోపులాట

కోదండరామున్ని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు రావడం... టీటీడీ ముంద స్తు చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు మధ్య పెద్ద ఎత్తున తోపులాట చోటు చేసుకుంది. ఒక దశలో టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి భక్తులను అదుపు చేయడం వీలు కాకపోవడంతో కొద్దిసేపు ఒకరిపై ఒకరు పడ్డారు. కొంత మంది మహిళలు కింద పడటంతో దర్శనం చేసుకోకుండానే వెనుతిరిగారు. భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో మధ్యా హ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాగా, అయోధ్యలో జరుగుతున్న రామ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కోదండ రామాలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. బీజేపీ రాష్ట్ర నేత రమేష్‌నాయుడు భక్తులతో కలిసి రామనామస్మరణలో పాల్గొన్నారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్) జనవరి 22: వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ స్పందనలో బాధితులు ఇచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ విన్నపాలను కలెక్టర్, అధికారులకు విన్నవించారు. వారిసమస్యలు విన్న తరువాత కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. అర్జీలు పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, అధికారులు యదుభూషణ్ రెడ్డి, ఆనంద్ నాయక్, ప్రత్యూష, తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 22: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలను అత్యధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్‌వో సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్దేశిత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

ఖైదీలను మంచి పౌరులుగా తీర్చి దిద్దుతున్నారు

- జైలు సిబ్బంది పనితీరు భేష్
- వైవీయూ వీసీ ప్రొఫెసరు చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ చింతా సుధాకర్

కడప (క్రైం), జనవరి 22 : ఖైదీల ఆలోచనా విధానం మార్చి మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో జైలు సిబ్బంది పనితీరు అభినందనీయమని యోగివేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ కొనియాడారు. కడప కేంద్ర కారాగారంలో రిట్రీట్ 2024 కార్యక్రమం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైళ్ల శాఖ అధికారులు ఖైదీలనందరినీ రక్షిస్తూ వారిని సంస్కరిస్తున్నారని.. ఖైదీల సంస్కరణ ద్వారా సమాజాన్ని మారుస్తున్నారన్నారు. మంచి సమాజంతోనే దేశాభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఖైదీల శిక్షను కూడా శిక్షణగా మార్చి వారిలో పెనుమార్పు తెస్తున్నారన్నారు. అనంతరం డిప్యూటీ ఇన్‌స్పెక్టరు జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ప్రొసీడింగ్ ఆఫీసరు రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ 8 జిల్లాల్లో ఉన్న కారాగార సిబ్బందికి సదరు రీట్రీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది జైళ్లశాఖ అభివృద్ధికి కావాలసిన విషయాలను రీట్రీట్‌లో చర్చించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారి ప్రకాశ్, ఉపపర్యవేక్షణాధికారి సాంబశివరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా జైల్లోని స్టీలు ఫ్యాక్టరీ, సబ్బుల ఫ్యాక్టరీ, బ్రిక్స్ ఫ్యాక్టరీలను ప్రొఫెసరు చింతా సుధాకర్ పరిశీలించారు.

టీడీపీ నాయకులపై పోలీసుల అక్రమ కేసులు

- త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ప్రవీణ్ బైఠాయింపు
- నిందితులైనా.. వైసీపీ వారిని అరెస్టు చేయరా
- సీఐలను నిలదీసిన ప్రవీణ్‌రెడ్డి



పోలీసు స్టేషన్‌లో సీఐలతో ప్రవీణ్‌రెడ్డి వాగ్వాదం

ప్రొద్దుటూరు, జనవరి 22: ప్రొద్దుటూరులో టీడీపీ నాయకులపై ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఒత్తిళ్లతో పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసి జైళ్లకు పంపుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి ఆగ్రహించారు. సోమవారం టీడీపీ నాయకుడు ఆవుల దస్తగిరి డబ్బుల బాకీ విషయమై చిన్న గొడవ పడ్డారు. దీన్ని కారణంగా చూపి పోలీసులు అక్రమంగా కిడ్నాప్, హత్యాయత్నం లాంటి తప్పుడు కేసులు బనాయించడాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ కార్యకర్తలతో కలిసి ప్రవీణ్‌రెడ్డి త్రీటౌన్ పోలీసు స్టేషన్లో బైఠాయించి ఆందోళన చేపట్టారు. సీఐ బయటికి రావాలి అని నినాదాలు చేశారు. ఈసందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 2022లో నమోదైన 307 కేసులో నిందితు లైన వైసీపీ నాయకులు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి(కౌన్సిలర్), గరిశపాటి లక్ష్మీదేవి (కౌనిలర్), గురనాథ్ రెడ్డిలను ఎందుకు అరెస్టు చేయలేదని పోలీసులను నిలదీశారు. వన్‌టౌన్ మహిళా ఎస్ఐ హైమావతిపై రాళ్ల దాడిచేసిన ఇసుక మాఫియాను ఎందుకు అరెస్టు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎస్ఈబీ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ముస్లిం ఎస్ఐ అలీబేగ్ చైర్‌లో కూర్చొని అతన్ని నిలబెట్టి దూషించిన ఎమ్మెల్యే రాచమల్లుపై కేసు ఎందుకు నమోదు చేయలేదని నిలదీశారు. జిల్లా ఎస్పీని సైతం దారుణంగా మాట్లాడితే ఎమ్మెల్యేపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ప్రొద్దుటూరులో పోలీసులు రాజ్యాంగ బద్దంగా పనిచేస్తున్నారా.. రాచమల్లు కింద పనిచేస్తున్నారో తెలపాలన్నారు. రేపటి నుంచి వైసీపీ నాయకులను అరెస్టు చేయకపోవడంపై ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారంతో పాటు పోలీసులపై పోరాటం చేస్తానన్నారు. జాతీయ ఎన్నికల కమిషనుకు కూడా పోలీసు అధికారుల పక్షపాత వైఖరిపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సీఐలు వెంకటరమణ, శ్రీకాంత్ యాదవ్‌లు ప్రవీణ్‌రెడ్డితో చర్చించారు. ఈ ఆందోళనలో ప్రవీణ్‌రెడ్డి వెంట టీడీపీ సీనియర్ నేత ఈవీ సుధాకర్‌రెడ్డి టీడీపీ పట్టణ అధ్యక్షుడు వైఎస్ జబీవుల్లా, కౌన్సిలర్ వైస్‌మహ్మద్ గౌస్, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీనారాయణమ్మ, జిల్లా నాయకురాలు శ్రీదేవి, బీసీ మహిళా నేత డక్కి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

రామాపురం, జనవరి 22: రాచపల్లి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులకు పశు వ్యాదుల పట్ల అవగాహన సదస్సును జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచపల్లి పంచాయతీలోని గంగనేరు, పొలిమేరపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. గత కొన్ని రోజులుగా చనిపోతున్న ఆవుల వ్యాధి నివారణ చర్యలు, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల గురించి పశువుల యజమానులకు వివరించారు. మంగళవారం ఆ గ్రామంలో పశువైద్య బృందం ఆధ్వర్యం లో పశువులు పశువైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో గ్రామంలో ఉన్న ప్రతి పశువులకు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు మాలకొండయ్య, పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా హాకీ టోర్నమెంట్‌కు ఎంపికైన అండర్-14 జిల్లా బాలుర జట్టు



ఎంపికైన జిల్లా బాలుర జట్టుతో సుభాన్‌బాషా

కడప (స్పోర్ట్స్), జనవరి 22 : లక్నోలో ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరుగనున్న 34వ ఆల్ ఇండియా కేడీ సింగ్‌బాబు సబ్ జూనియర్స్ అండర్-14 బాలుర హాకీ టోర్నమెంట్‌కు జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఆ మేరకు సోమవారం స్థానిక డీఎస్ఏ స్టేడి యంలో నిర్వహించిన జిల్లా హాకీ జట్టు ఎంపిక లకు వివిధ జిల్లాల నుంచి ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 16 మంది బాలురను ఎంపిక చేసినట్లు కడప ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్-సెక్రటరీ సుభాన్‌బాషా వెల్లడించారు.

ఎంపికైన జిల్లా బాలుర జట్టు : సాయిమోహన్, మస్తాన్‌బాషా, సురేష్, మహిధర్, హర్షవర్ధన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పార్థివర్మ, అజయ్‌కుమార్‌రెడ్డి, అబూబకర్‌సిద్దిక్, వెంకట సందీప్‌రెడ్డి, జస్వంత్, కిశోర్, నాగతరుణ్, సాయిచరణ్, అలీ మురాద్‌బాష, కీర్తన్‌కాంత్‌రెడ్డి ఉన్నారు. ఎంపికైన బాలుర జట్టుకు సుభాన్‌బాషా టీ షర్ట్స్ అందజేశారు. డీఎస్ఏ హాకీ కోచ్ కల్యాణ్‌కుమార్, సీనియర్ హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, జనవరి 22: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ కృష్ణారావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన (గ్రీవన్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 43 ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలన్నారు. అలాగే ఫిర్యాదు దారులతో నేరుగా మాట్లాడడమే కాకుండా వీడియో కాన్ఫరెన్స్, టెలికాన్ఫరెన్స్‌లో వారి సమస్యలను అడిగి తెలుసుకుని న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించాలని, తీసుకున్న చర్యల నివేదికను ఎప్పటికప్పుడు పోలీసు ప్రధాన కార్యాలయానికి అందించాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.

ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కడప(రూరల్) జనవరి 22 : ఉమ్మడి కడప జిల్లాలో అనిమల్ హస్బండరీ అసిస్టెంట్(ఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీకి సంబంధించి సోమవారం కడప కోటిరెడ్డి సర్కిల్ సమీపంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 210 పోస్టులు ఉండగా 130 మంది క్వాలిఫై అయ్యారు. వీరికి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు సోమ, మంగళవారాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. సోమవారం 59 మంది అభ్యర్థులు హాజరు కాగా... సంబంధిత అధికారులు వాటిని పరిశీలించారు.

రాములోరికి సర్వత్రా పూజలు





చెన్నూరులో పూజలందుకున్న సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులు... కడప: రాములోరికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం... వల్లూరు: గ్రామోత్సవంలో శ్రీరామచంద్రుడు

చెన్నూరు, జనవరి 22 : అయోధ్యలోని రామ్‌లల్లాలో సోమవారం జరిగిన బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని అన్ని రామాలయాల్లో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. చెన్నూరు సీతారామ సంకీర్తన క్షేత్రం, బెస్తకాలనీ రామాలయాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగిన బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని స్వయంగా స్క్రీన్‌పై వీక్షించడంతో ప్రజలు పులకించిపోయారు. ప్రతి గ్రామం నుంచి పూజించి తెచ్చిన కలశాలకు శ్రీరామ సహస్ర పుష్పార్చన చేశారు. అలాగే 11గంటలకు శ్రీరామ సంకీర్తనగావించారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో రాయలసీమ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ మాలేపాటి శ్రీనివాసులరెడ్డి, ప్రధాన పౌరోహితులు కోడూరు రాజేష్‌స్వామి సందేశమిచ్చారు. రామనామం ఎంత మధురమో, రాముని సాధారణ జీవితమే మానవాళికి సందేశమని, ఆయన చూపిన మార్గం, ఆడి తప్పని మాట, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవం ఆచరణీయమన్నారు. కార్యక్రమాల్లో మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అలాగే కొండపేట, ఉప్పరపల్లె, రామనపల్లె, కనుపర్తి, గుర్రంపాడు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

రాములోరికి ప్రత్యేక పూజలు

కడప (కల్చరల్), జనవరి 22: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం నగర బిల్టప్ సమీప విజయదుర్గాకాలనీలో ప్రత్యేకంగా లక్ష్మణ, ఆంజనేయ, సీతా సమేత రాములోరి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామచంద్రమూర్తి నామ జపంతో పాటు భజన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆ కాలనీ నివాసులు గోవిందు నాగరాజు, జయరామిరెడ్డి, సీఆర్‌ఐ పెద్ద సుబ్బరాయుడు, ఆంజనేయులు, ఏసీ కొండారెడ్డి, సీఆర్‌ఐ సునీల్ జయంత్, సారథ్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పు, నైవేద్యం స్వామివారికి సమర్పించి భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ నివాసులు రాధాకృష్ణ, వెంకటసుబ్బయ్య, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామనామ స్మరణతో మార్మోగిన గ్రామాలు

వల్లూరు, జనవరి 22 :అయోధ్యలో రామాలయ పునర్నిర్మాణం కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాల్లో జై శ్రీరామ్ అనే నినాదాలు హోరెత్తాయి. ప్రతి గ్రామంలో ఉన్న రామాలయాలు సుందరంగా అలంకరించి స్వాములకు అభిషేకాలు పంచామృతాభిషేకం చేశారు. ముఖ్యంగా గోటూరు, వల్లూరు, పైడికాల్వ, కొప్పోలు ఇంకా తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గోటూరు గ్రామంలో అన్నదానం చేశారు.

వాడవాడలా పూజలు, భజనలు

వేంపల్లె, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని వేంపల్లె, చుట్టుపక్కల గ్రామాల్లోని వీధివీధినా శ్రీరాముడి నామస్మరణ మార్మోగింది. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సీతారామలక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు గావించారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. గాంధీరోడ్డులోని కుమ్మరకాలనీ, గాజులపేట, రెడ్డయ్యకాలనీలోని రామాలయం, వడ్డె వీధిలోని శ్రీకృష్ణాలయం తదితర అన్నిచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కాలేజీ రోడ్డులోని వాసవీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నరసింహులు ఆధ్వర్యంలో నందనవనంలో లక్షదీపారాధన నిర్వహించి అన్నదానం చేశారు.

వైభవంగా రాములోరి శోభా యాత్ర

సింహాద్రిపురం, జనవరి 22: అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం సింహాద్రిపురం పుర వీధులలో రాములోరి శోభా యాత్రను ఘనంగా నిర్వహించారు. మహిళలు సైతం జెండాలు చేత పట్టి రామనామం జపిస్తూ యాత్రలో రథం ముందు నడిచారు. సింహాద్రిపురం శ్రీమేధ స్కూల్ వీధిలోని మహిళల కోలాటం బృందం వారి ప్రదర్శన ఈ యాత్రలో పలువురిని ఆకట్టుకుంది. బాజాభజంత్రీలు, భజన భక్త బృందాలచే ఊరేగింపు కోలాహలంగా జరిగింది. నిడివెలగల ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన శోభా యాత్ర పట్టణ పురవీధుల గుండా సాగింది. రామాలయంలో దివంగత వీరారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి ఊరేగింపులో తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

నబీకోట రామాలయంలో ప్రత్యేక పూజలు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో బాగంగా కడపనగరం 47వ డివిజన్ నబీకోట రామాలయంలో కార్పోరేటరు పాకా సురేష్‌ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మందిర ప్రాంగణంలోఎల్‌సీడీ ఏర్పాటు చేసి బాలరాముడి ప్రత్యక్ష ప్రసారం ,విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పోరేటరు బాలస్వామిరెడ్డి, కాంట్రాక్టరు వేణుగోపాల్‌రెడ్డి, రెడ్డి వర కుమార్, శరత్, అంజి, భద్రయ్య, శ్రీనివాస్, వినోద్‌కుమార్‌రెడ్డి, బాలాజీ, శ్రీను, నాగయ్యతో పాటు స్థానికులు అధిక సంఖ్యలో ఎల్గొన్నారు.

సీకేదిన్నెలో... మండలంలోని వివిధ ఆలయాల్లో స్వామివారి కల్యాణాలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం ఇళ్లవద్ద దీపాలు వెలిగించి అయోధ్య రాముడికి స్వాగతం పలికారు.

చక్రాయపేటలో శ్రీరామచంద్రుని ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న వేంకటేశ్వర, వీరభద్రస్వామి ఆలయ ఛైర్మన్ లాయర్ మోపూరి రామాంజనేయరెడ్డి

చక్రాయపేట, జనవరి 22:అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా చక్రాయపేట మండలంలో ఊరేగింపు కార్యక్రమాలు, భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రమైన చక్రాయపేటలో వెలసిన వేంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి ఆలయంలో ఛైర్మన్ లాయర్ మోపూరి రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామచంద్రుని బ్యాండ్ మేళాలతో, బాణసంచాలతో, భజన బృందాలతో ఘనంగా ఊరేగించారు. అలాగే ఆంధ్ర అయోధ్య అయిన దశరథ మహారాజ స్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం స్వామివారికి పూజలు మొదలుకొని 10గటలకు నాగులగుట్టపల్లె హైస్కూల్ నుంచి దశరథ మహారాజు స్వామి దేవస్థానం వరకు కోలాటంతో అంగరంగవైభవంగా సీతారాముల ఊరేగింపు అనంతరం గంటలకు అయోధ్యలో జరిగే శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఎల్‌ఈడీలతో వీడియో లైవ్ ఏర్పాటుచేశారు. అనంతరం 2000 మందికి స్వామివారి అన్నప్రసాదం నిర్వహించారు. అనంతరం భజనలు నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామ ప్రతిష్ఠ కోసం 500 సంవత్సరాల నుంచి ప్రతి హిందూ బంధువు కన్న కల నెరవేరుతున్న రోజు కాబట్టి అయోధ్యలో శ్రీరామచంద్రుడు పుట్టిన ప్రదేశం శ్రీరాముడు నడిచిన నేల అంతటి పవిత్రమైన శ్రీరామ పుణ్యభూమి భారతదేశమే కాక ప్రపంచంలో నలుమూలలు ఉన్న హిందూ బంధువులు చేసుకోవాల్సిన తొలి పండుగ శ్రీరామప్రతిష్ఠ దినోత్సవం అని పలువురు పేర్కొన్నారు.





వేంపల్లెలో పూజలు చేస్తున్న మహిళలు | కడప: అన్నదాన కార్యక్రమంలో పాకా సురేష్ తదితరులు | సింహాద్రిపురంలో రాములోరి గ్రామోత్సవం

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

కడప (క్రైం), జనవరి 22 : అగ్నిప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి బస్విరెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో గల యూరోకిడ్స్ ప్రీ స్కూలు వారి ఆధ్వర్యంలో స్కూలులో చిన్నపిల్లలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో ఏ విధంగా ఉండాలి, ఏ విధంగా ప్రమాదం నుంచి బయటపడాలి అన్న విషయాలు తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు గదుల్లో పొగ నిండినప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలన్న దానిపై సిబ్బందితో డ్రిల్ చేయించారు. అనంతరం అగ్నిని ఆర్పే యంత్రాలు, ఎమర్జన్సీ అండ్ రెస్క్యూ టూల్స్ వారికి చూపించి వాటి యొక్క ప్రాధాన్యతను డెమో ద్వారా చేసి చూపారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిల్ అనూష, వారి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client, Bank Manager, Canara Bank, ITI Circle, Kadapa City. It is informed that my client Bank, has about to sanction of the loan for below mentioned property in favour of **C. Chalama Reddy S/o Late C. Narapa Reddy**, R/o Yerramukkapalli, Kadapa. But the borrower was misplaced his link documents vide **doc. nos. 855/1997 & 855/1998 of SRO, Kadapa. S.H.O., 1 Town P.S.** has issued missing certificate in this effect on 20.01.2024. So if someone have any objections of the same to be inform to my client Branch, within a seven days. **SCHEDULE**: YSR District, Kadapa Urban Sub district, within Kadapa Municipal Corporation area limits of Nagarajupalli in Sy. No. 112/1 an extent of 233.93 sq. yards of G+2 Residential Building in D. No. 1/43 & 1/44 of Railway Station Road, Y.M.Palli within the following **Boundaries**: East : K.Sreeramulu Joint Wall, West : Sandhu Rastha & Subba Narayana Sing & Ram Singh houses, North : Public Drainage Canal & Abdul Khader Vacant Site, South: Public Road

G.VENKATESWARA REDDY
Advocate, Kadapa

బహిరంగ ప్రకటన

[illegible] M/s. Shriram Finance Ltd., Nellore-1 [illegible]

SCHEDULE

[illegible]

Perepi Venugopal, B.Com., B.L.,
Advocate, Tekkemitta, Nellore-3. Cell :8374259528

రిఫ్లెక్ట్ స్టిక్కర్లు అతికించుకోవాలి

పులివెందుల టౌన్, జనవరి 22: ఆటో రిక్షాలకు రిఫ్లెక్ట్ స్టిక్కర్స్ అతికించుకోవాలని ఎంవీఐ బి.వి.ప్రసాద్, ఎస్‌ఐ అరుణ్‌రెడ్డిలు సూచించారు. జాతీయ భద్రత 3వ మాసోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆటో రిక్షా డ్రైవర్లకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలు పాటించాలన్నారు.

పీఆర్ ఉద్యోగులు సభ్యులుగా నమోదు చేసుకోవాలి

కడప(రూరల్) జనవరి 22 :జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులు సంఘంలో సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని ఏపీపీఆర్‌ఎం ఈఏ రాష్ట్ర నాయకుడు ఆర్. నాగిరెడ్డి, జిల్లా యూనిట్ అధ్యక్షులు మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం యూనిట్లు, పరిషత్ యూనిట్, జిల్లా యూనిట్‌ల పదవీకాలం ముగిసిందన్నారు. ఆయా స్థానాల్లో నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడానికి సంఘం ఆమోదంతో జిల్లాలో ఎన్నికలను నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నామన్నారు.

'కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత మీకు లేదు'

చెన్నూరు, జనవరి 22 : కాంగ్రెస్ పార్టీలో జడ్పీటీసీగా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా గెలిచిన కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డికి ఆ పార్టీ గురించి మాట్లాడే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. చెన్నూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 138 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులకు పదవులు ఇచ్చిందని, ఆ పార్టీ ద్వారా రాజకీయ భిక్ష పొంది ఇప్పుడు విమర్శించడం ఏమిటన్నారు. రెండు మార్లు ఎమ్మెల్యేగా గెలిచినా అభివృద్ధి శూన్యమన్నారు.

అంగన్వాడీల నిర్బంధం సరికాదు: డీవైఎఫ్ఐ

కడప (నాగరాజుపేట), జనవరి 22 : అంగన్వాడీల అక్రమ నిర్బంధం సరికాదని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చలో విజయవాడ కార్యక్రమానికి బయల్దేరుతున్న అంగన్వాడీల నాయకత్వాన్ని, కార్యకర్తలను అక్రమంగా పోలీసుస్టేషన్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తక్షణమే అరెస్టు చేసిన అంగన్వాడీ సంఘం నాయకులను విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

అర్ధరాత్రి అరెస్టులు అమానుషం: సీఐటీయూ

అంగన్వాడీల అర్ధరాత్రి అరెస్టులు అమానుషమని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మీదేవిలు పేర్కొన్నారు. విజయవాడలో అంగన్వాడీల అరెస్టుకు నిరసనగా పోలీసులుఅంగన్వాడీ నాయకురాళ్లను చలో విజయవాడకు వెళ్లనీయకుండా ఆదివారం అర్ధరాత్రి హౌస్ అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా నగరంలోని పాతబస్టాండులో రాస్తారోకో నిర్వహించారు.

సమ్మెకాలాన్ని రద్దు చేస్తూ వేతనాలు చెల్లించాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 22 : మున్సిపల్ కార్మికుల సమ్మె కాలం డిసెంబరు 26 నుంచి జనవరి 12 వరకు జరిగిన కాలాన్ని రద్దు చేస్తూ ఆ సమయంలో వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల సంఘం సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు సీఐటీయూ నాయకులు సుంకర రవి డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వారు కమిషనరును కలిసి వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు చంద్రారెడ్డిపాల్గొన్నారు.

కబ్జాల్లో మామ, అల్లుళ్ల పోటాపోటీ

● దోచుకోవడం దాచుకోవడం వారికి అలవాటే: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 22 : భూకబ్జాలు. కుంభకోణాల్లో మామ అల్లుళ్లు పోటాపోటీగా ఉంటూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా పేర్కొన్నారు. కమలాపురంలో నిర్వహించిన రా కదలిరా కార్యక్రమం విజయవంతం కావడంతో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం కాక ముదు మీ పరిస్థితి ఏంటి, అయిన తరువాత ఎలా ఎదిగారో ఎవరిని అడిగినా చెప్తారన్నారు. ఇంత సంపద ఎలా వచ్చిందో చెప్పగలరా ఎమ్మెల్యేగారూ.. అంటూ ప్రశ్నించారు. వాసుదేవరెడ్డి, శంకర్‌రెడ్డి, శేషారెడ్డి, వీరాంజనేయులు, నవనీశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, దాది రామయ్య, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్‌ను దేవాలయంలోకి అనుమతించక పోవడం దుర్మార్గం

కడప(కలెక్టరేట్), జనవరి 22: అస్సాంలో శంకర్‌దేవ్ సత్రాలయంలోకి కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీకి అనుమతించకపోవడం దుర్మార్గమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. సోమవారం రాహుల్ గాంధీకి మద్దతుగా కాంగ్రెస్ శ్రేణులు గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామా అనే సందేహం వ్యక్తమవుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మధు రెడ్డి, అలీఖాన్, లక్ష్మయ్యలావణ్యపుల్లయ్య పాల్గొన్నారు.

విధ్వంసానికి ప్రతిరూపం వైసీపీ పాలన

● టీడీపీ కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి



కరపత్రాలు అందిస్తున్న మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 22 : జగన్‌రెడ్డి పాలనంతా దోపిడీ, దౌర్జన్యాలు, విధ్వంసానికి ప్రతిరూపమని కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం కడప నగరం 15వ డివిజన్ పుట్లంపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు. అలాగే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, రాయుడు, రెడ్డయ్యయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, మాసాపేట శివ, తిరుమలేశ్, జిలానీబాషా, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడుతో పాటు అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల వేతనాలు పెంచమంటే అక్రమ అరెస్టులా?

అంగన్వాడీలు వేతనాలు పెంచమంటే అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని టీడీపీ కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రి పోలీసుస్టేషన్‌లో నిర్బంధిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దొంగ ఓట్ల వల్ల అధికారులు బలవుతున్నారు

● టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు, లక్ష్మీరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న అమీర్‌బాబు, లక్ష్మీరెడ్డి, మన్‌మోహన్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 22 : వైసీపీ అధికారంలోకి రావాలని ఇష్టానుసారంగా దొంగ ఓట్లు ఎక్కిస్తున్నారని. ఇందులో అధికారులు బలవుతున్నారని సీనియర్ నాయకులు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. సోమవారం కడప నగరంలోని రెండో గాంధీ బొమ్మ వద్ద నుంచి ఏడురోడ్ల కూడలి వరకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి దొడ్డిదారిన అక్రమ ఓట్లు ఎక్కించి గెలవాలని చూస్తున్నారన్నారు. అక్రమ ఓట్లు ఎక్కించడంలో అధికారులపై వత్తిడి తెచ్చి వారిని బలి చేస్తున్నారని ఆరోపించారు. తిరుపతిలో జరిగిన అక్రమాలపై మా నాయకులు చంద్రబాబు, పవన్‌కళ్యాన్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయగా ఐఏఎస్ అధికారి, ఆర్డీఓలు, ఎమ్మార్వోలు, కంప్యూటరు సిబ్బంది, బలయ్యారన్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు గెలవడం ఖాయమన్నారు. టీడీపీ నాయకులు కొండాసుబ్బయ్య, జింకా శ్రీనివాసులు, జయరమిరెడ్డి, పిచ్చయ్య, నబికోట శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, నగేష్, మురళియాదవ్, రవిశంకర్‌యాదవ్, అయ్యవారుయాదవ్, సుధాకర్, నాసర్ ఆలీ, మహిళా నాయకురాలు స్వర్ణలత, మీనాక్షి, రామలక్షుమ్మ, అమరావతి, శ్రీదేవి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

● టీడీపీ నేత గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 22 :వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం కడప నగరం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్లపాలనలో ప్రజల ఆదాయం పెరగలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అధిక ధరలు పెంచి ప్రజలపై పన్నుల భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో అందించిన సంక్రాంతి కానుక, క్రిస్మస్, రంజాన్ తోఫా సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. భూ రక్షణ చట్టం అమల్లోకి వస్తే భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. టీడీపీ వచ్చాక భూరక్షణ చట్టం రద్దు చేస్తామన్నారు. వైసీపీ దుష్ట పాలనకు చరమగీతం పాడి టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలు సహకరించాలన్నారు.


అందరికీ సమాన న్యాయం అందించడమే విధి

● చెన్నూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన పార్థసారధి



చెన్నూరు, జనవరి 22 : అందరికీ సమాన న్యాయం అందించడమే తమ విధి అని సీఐ పార్థసారధి అన్నారు. చెన్నూరు నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఏ సమయంలో అయినా తమకు న్యాయం కోసం స్టేషన్‌కు నిర్భయంగా రావచ్చన్నారు. న్యాయం అందించడంలో చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. అంతేకాక అసాంఘిక కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం ఇవ్వనని, వాటిని కఠినంగా అణచివేస్తామన్నారు. కర్నూలు జిల్లాలో ఆదోని ట్రాఫిక్ నుంచి వచ్చిన తాను అక్కడ ఆదోని రూరల్, శ్రీశైలం, నంద్యాల పోలీసుస్టేషన్లలో పనిచేసి ప్రస్తుతం బదిలీపై చెన్నూరు సీఐగా బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. అలాగే ఇసుక, ఎర్రచందనం, మట్కా, గ్యాంబ్లింగ్ తదితరాలను ఏ మాత్రం ఉపేక్షించనన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటిస్తూ వాహన రికార్డులు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా హైవే రహదారుల్లో ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, ర్యాష్ డ్రైవింగ్ తగదన్నారు. డ్రైవింగ్ చేసేందుకు తగిన వయసు లేని వారు ఎవరైనా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. అలాగే గ్రామాల్లో సమస్యలు సృష్టించవద్దన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి గ్రామాన్ని జాగ్రత్తగా గమనిస్తుంటామని, ప్రతి ఒక్కరి కదలికలను చూస్తుంటామని తెలిపారు. అలాగే ప్రజలు కూడా తమ వంతు బాధ్యదగా పోలీసుశాఖకు సహకరించాలన్నారు.

వల్లూరు ఎస్‌ఐగా వెంకటరమణ



బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ వెంకటరమణ

వల్లూరు, జనవరి 22 : వల్లూరు ఎస్‌ఐగా సోమవారం వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పనిచేస్తూ బదిలీపై కడప వీఆర్‌కు వచ్చి, అక్కడి నుంచి వల్లూరు మండల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలు శాంతియుతంగా ఉండలాన్నారు. మట్కా జూదం నిర్వహించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంఆమన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

గండి ఛైర్మన్‌గా కావలి కృష్ణతేజ



గండి నూతన పాలక మండలి ప్రమాణస్వీకార దృశ్యం

చక్రాయపేట, జనవరి 22: గండి వీరాంజనేయస్వామి దేవస్థానం నూతన ఛైర్మన్‌గా కావలి కృష్ణతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం గండి క్షేత్రంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి నూతన పాలక మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఛైర్మన్‌గా కావలి కృష్ణతేజ, పాలకవర్గం సభ్యులుగా కొప్పల మునీశ్వరి, సుబ్బిరెడ్డిగారి జయమ్మ, ముద్దికుమారి బుక్కె లలితమ్మ, కె.సోమకళావతి, బి.చక్రపాణిరెడ్డి, పబ్బతి బిందు సాగర్, వెంకటరామిరెడ్డి, రాచినేని మధు, నారుబోయిన సుగుణమ్మ, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా వర్తి కేసరిలు ప్రమాణ స్వీకారం చేశారు. కృష్ణతేజ మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

దశలవారీగా గండి ఆలయ అభివృద్ధి : ఎంపీ

గండి వీరాంజనేయస్వామి దేవస్థానం దశలవారీగా అభివృద్ధిచేస్తామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఎంపీ హాజరై మాట్లాడారు. అలాగే గండి నిత్యన్నదాన పథకానికి ఎంపీ అవినాష్‌రెడ్డి రూ.18 లక్షలు విరాళం అందించారు.

మట్కా బీటరు అరెస్టు

కడప (క్రైం), జనవరి 22 : పాతబస్టాండు సమీపంలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నకాశ్ వీధికి చెందిన సయ్యద్ తబరేష్ బాషా పాతబస్టాండు సమీపంలో మట్కా రాస్తుండగా అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.10,360 నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


ప్రొద్దుటూరు టౌన్: కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు


బద్వేలు రూరల్: గాండ్లవీధిలో పల్లకీపై ఊరేగుతున్న శ్రీరాములవారు


మైదుకూరులో వాల్మీకి రామాయణంతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


ఎర్రగుంట్లలో సీతారామలక్ష్మణ వేషధారణతో చిన్నారుల ప్రదర్శన

మార్మోగిన రామనామం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 22 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. సోమవారం ఆలయాలు, హిందూ ధార్మిక సంఘాలు, వీహెచ్‌పీ ఆధ్వర్యంలోో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. . హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణం చేశారు. సాయంత్రం 108 మంది మహిళలు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు.

ఎర్రగుంట్ల: మెయిన్‌బజార్‌లోని శ్రీరామాలయం నుంచి భక్తులు శ్రీరామ నామస్మరణ చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, మహిళామండలి ఆధ్వర్యంలో పూజలు చేశారు. చిన్నారులు ప్రత్యేక వేషధారణలో అలరించారు. నడివూరులోని శ్రీరామాలయంలో పూజలు, భజనలు, ఐసీఎల్‌లోని ఆలయంలో శ్రీరాముడికి అభిషేకం, పోట్లదుర్తిలోని శ్రీరామాలయంలో పూజలు నిర్వహించారు. కదిరివారిపల్లె, మరికొన్ని గ్రామాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు.

కొండాపురం: మండలంలోని అన్ని రామాలయాల్లో అభిషేకాలు,పూజలు, అన్నదానం చేశారు. అయోధ్య అక్షింతలను భక్తులకు పంచిపెట్టారు. రేగడిపల్లె రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాధాలను పంపిణీ చేశారు.

బద్వేలు: పట్టణంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలిలో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

బద్వేలు రూరల్: రామాలయాలన్నీ రామనామ స్మరణతో మారుమోగాయి. గాండ్లవీధి, అబ్బరాతివీధి, రాజు గారివీధి, సిద్దవటం రోడ్డులో బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, సురేంద్రనగర్ రామాలయా ల్లో పూజలు నిర్వహించి అన్నదానం చేశా రు.

పోరుమామిళ్ల: రెడ్డినగర్ లోని కోదండరామస్వామి ఆలయాన్ని రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాశ్‌రెడ్డి సందర్శించారు. వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మల్లకతవ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం వరకూ మహిళ లు 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కమ్మవారిపల్లెలోని కోదండరామస్వామి దేవాలయంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ నాయకులు కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య. చిన్న వెంకటసుబ్బయ్య, రమేష్ పూజలు నిర్వహించారు.

ముద్దనూరు: పాత వీధిలోని రామాలయంలో పూజలు చేశారు.. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. కన్యకాపరమేశ్వరీ ఆలయ మహిళా కమిటీ నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

మైదుకూరు: పట్టణంలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం వాల్మీకి రామాయణంతో శోభాయాత్ర నిర్వహించారు.

అట్లూరు: మండలంలోని రామాలయాల్లో పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో తెప్పెట్లు, మేళాలు కోలాటాలతో ఊరేగింపులు నిర్వహించారు. అన్నదానం చేశారు.

బి.కోడూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు తెల్లవారుజాము నుండే ఇళ్ల ముందు ముగ్గులు వేయడం, రాములవారి గుడిలో పూజలు నిర్వహించడం, తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు అనంతరం కోలాటం, హరి భజనలు, దేవుని సంబరాలు ఘనంగా నిర్వహించారు.

కలసపాడు: స్థానిక కోదండ రామస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు వర ప్రసాదరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఖాజీపేట: బస్టాండు కూడలిలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు కోదండరామస్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు తాతా విజయలక్ష్మి, అధ్యక్షుడు గరిశ గంగిశెట్టి ఆధ్వర్యంలో పుష్పయాగం చేశారు.

కాశినాయన: గొంటువారిపల్లెలో రాములవారి కల్యాణం నిర్వహించగా పిట్టిగుంట, నర్సాపురం తదితర గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదానాలు, భజనలు చేశారు.

రాజుపాలెం: పొట్టిపాడు గ్రామంలో సోమవారం రాములవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. మాజీ ఎంపీపీ మెట్టుపల్లి ప్రభాకర్‌రెడ్డి ఆలయానికి రూ.2.50 లక్షలు సొంత నిధులు ఇవ్వడంతో ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు టీడీపీ నాయకులు బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రాజుపాలెం టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, జయంత్‌రెడ్డి పాల్గొన్నారు.

'మోదీతో దేశంలో రామరాజ్యం'

కొండాపురం, జనవరి 22: ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశంలో రామరాజ్యం కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. అయోధ్యలో రాములవారి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో కొండాపురం పాత ఊరి రామాలయంలో ఆయన సోమవారం పూజలు నిర్వహించారు. జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు దేవగుడి శివనారాయణరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏటూరు రమణారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు నాగిరెడ్డి, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాబురెడ్డి, శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, తిమ్మాపురం బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల నడివూరులోని శ్రీరామాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వాసు, శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రెడ్డి, కత్తిప్రతాప్‌రెడ్డి, కోగటం నారాయణరెడ్డి,కలమల్ల బాబు, సుబ్బరామయ్య, అంకిరెడ్డి, షరీఫ్ హరినాథరెడ్డి, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: వేపరాల రామాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూజలు నిర్వహించారు.

ముద్దనూరు: బడుగువారిపల్లె గ్రామంలోని రామాలయంలో ఆదినారాయణరెడ్డి,మండల బీజేపీ నాయకులు కె.మధుసూదనరెడ్డి, గుణవంత్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కమలాకర్‌రెడ్డి పూజలు చేశరు

జమ్మలమడుగు: మండలంలోని రామాలయాల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడితోపాటు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.రాజేష్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ చౌడం జొల్లు కొండయ్య, దేవిరెడ్డి గురుశేఖర్‌రెడ్డి, ఓబుళరెడ్డి, తదితరులు పూజలు చేశారు.


ఎర్రగుంట్ల: నడివూరులోని రామాలయంలో పూజలు చేస్తున్న ఆదినారాయణరెడ్డి


బద్వేలు: పూజలు నిర్వహిస్తున్న విజయమ్మ

బద్వేలు: మాజీ ఎమ్మెల్యే విజయమ్మ చిన్నకేశంపల్లి దేవాలయంలో పూజలు నిర్వహించారు. శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ మనందరి విజయమన్నారు.

నేడు సోషల్ ప్రతిభా పాటవ పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 22: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని సోషల్ స్టడీస్ ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించనున్నట్లు నేతాజీ సోషల్ స్టడీస్ క్లబ్ జిల్లా కన్వీనర్ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణాలయంలో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ప్రతి పాఠశాల నుంచి తెలుగుమీడియం నుంచి ఒకరు, ఇంగ్లీషు మీడియం నుంచి ఒక విద్యార్థి హాజరు కావచ్చునని, ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు.

చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జనవరి 22: రాష్ట్రంలోని అన్ని వర్గాలతోపాటు బీసీలను ఆదుకునేది టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడేనని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో క్షేత్రస్థాయిలో బీసీల సమస్యలు గుర్తించి వారి నుంచే నాయకుల్ని వెలికితీసే కార్యక్రమంలో భాగంగా 'జయహో బీసీ' సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం అన్న లక్ష్యంతో నందమూరి తారకరామారావు టీడీపీని ఏర్పాటు చేశారన్నారు. ఆయన తర్వాత చంద్రబాబు నాయుడు బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్ సైకోలాగా మారి బీసీలను పట్టించుకోలేదన్నారు. బీసీలంతా ఏకమై 2024 ఎన్నికల్లో సైకో జగన్‌ను గద్దె దించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కొండయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలకొండయ్య, మున్సిపాలిటీ పరిధిలోని బీసీ నేతలు పాల్గొన్నారు. అనంతరం అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ పురష్కరించుకుని పట్టణంలోని రామాలయాల్లో పూజలు నిర్వహించారు.

రాజుపాలెం: మండల పరధిలోని టంగుటూరు జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. బీసీలంతా కలిసికట్టుగా టీడీపీని బలోపేతం చేయాలన్నారు. ఎంపీటీసీ గుత్తి దస్తగిరి, గోపల్లె మాజీ సర్పంచ్ కరీముల్లా, మండల బీసీ నాయకులు శ్రీనివాసులుయాదవ్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణ బీసీ సెల్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ'కు ఎస్.ఉప్పలపాడు విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జమ్మలమడుగు, జనవరి 22: మండలంలోని ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి వి.రోహిత్‌కుమార్ పరీక్షా పే చర్చా కార్యక్రమంఆనికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.జరీనాబేగం తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఆ విద్యార్థికి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 29న భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో డిల్లీలో జరుగనున్న పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ఈ విద్యార్థి పాల్గొంటాడన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని తగ్గించేందుకు భారత ప్రధానమంత్రి విద్యార్థులకోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈనెల 23న విద్యార్థి రోహిత్‌కుమార్ డిల్లీకి బయల్దేరి గణతంత్ర వేడుకల్లో పాల్గొంటాడని తెలిపారు.

కుల గణన సర్వే వేగవంతం

జమ్మలమడుగు, జనవరి 22: జమ్మలమడుగు మండలంలోని అన్ని గ్రామాలు నగర పంచాయతీలో కుల గణన సర్వే వేగవంతం చేశారు. పట్టణంలోని అంబాభవానీ దేవాలయం వీధిలో సోమవారం ఉదయం సచివాలయ సిబ్బందది సర్వే చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కులగణన సర్వే వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు.

గోపవరం ఎస్ఐగా రవికుమార్



గోపవరం, జనవరి 22 : గోపవరం మండలం ఎస్ఐగా రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. లింగాల మండలంలో పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకు ప్రవర్తించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా మందుబాబులు హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవన్నారు. మండల ప్రజలకు ఏమైనా సమస్యలు ఎదురైతే తమను సంప్రదించా లన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

గోపవరం, జనవరి 22 : మండలంలోని బ్రాహ్మణపల్లె ఎస్సీ కాలనీ నుంచి మల్లెం కొండేశ్వరస్వామి గుడి వరకు రోడ్డు పనులకు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి సోమవారం ప్రారంభించారు. సుమారు 40 లక్షల విలువైన పనులకు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు సమకూర్చారు. అనంతరం కాల్వపల్లెలోని ఆర్‌బీకే సచివాలయాలను, బేతాయపల్లెలో ఆర్‌బీకే , బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ను పీఆర్ అడ్వయిజర్ నాగార్జునరెడ్డితో ప్రారంభించారు. అనంతరం బుచ్చన పల్లె గ్రామంలోని శ్రీరామ ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు.

రాచమల్లు గూండాయిజానికి బుద్ధి చెప్పండి


గవిని సర్కిల్లో ప్రచారం చేస్తున్న ప్రవీణ్ రెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 22: ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి గూండాయిజానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని టీడీ పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యా లయం గవిని సర్కిల్లో బాబు ష్యూరిటీ.. భవి ష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జబీవుల్లా , కౌన్సిలర్ మహమ్మద్ ముజాయిద్దీన్ ఆరిఫ్, మైనుద్దీన్, హమీద్ భాయ్, గౌస్‌పీర్, ముస్తాక్ చాంద్‌బాషా అల్లాబకష్, తదితరులు పాల్గొన్నారు. .


బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల : చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్ని వర్గాల వారికి న్యాయం జరగాలంటే మళ్లీ చంద్రబాబు సీఎం కావాలని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న అన్నారు. సోమవారం పోరుమామిళ్లలో బెస్తవీధి, 6, 7 వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, ఇమాం హుసేన్, షరీఫ్, ప్రొఫెసరు బాషా, దానం, ఎస్‌ఎం బాషా, సెట్టెం ప్రతాప్, అతికారి రాజా పాల్గొన్నారు.

బి.కోడూరు: మండల పరిధిలోని తంగేడుపల్లెలో మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు బోడి రమణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బి.కోడూరు మండలంలో గత టీడీపీ ప్రభుత్వంలోనే ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు వేసి అభివృద్ధి చేశామని, అప్పటి రోడ్లే తప్ప వైసీపీ వారు ఒక్క రోడ్డు కూడా వేయలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, రాఘవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో బీసీలకు టికెట్టు ఇప్పించు

- రాచమల్లుకు సిఎం సురేష్ నాయుడు సవాల్


మాట్లాడుతున్న సురేష్‌నాయుడు

ప్రొద్దుటూరు ,జనవరి 22 : ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి బీసీలమీద నిజమైన ప్రేమ వుంటే ప్రొద్దుటూరు అసెంబ్లీ టికెట్టు బీసీలకు టికెట్టు ఇప్పించాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్ నాయుడు సవాల్ విసిరారు. సోమవారం స్థానిక అన్న క్యాంటీన్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏటి పోరంబోకు భూముల్లో కళ్యాణ మండపం కట్టుకోమని సగర కులస్తులకు చెప్పడం వారిని మోసగించడమేనన్నారు. ఈ విషయంపై కలెక్టరుకు ఫిర్యాదు చేశానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. ఏటి పోరంబోకులో అక్రమ కట్టడాలను తొలగిం చాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు ఎమ్మెల్యే కు తెలిసినా కల్యాణ మండపం నిర్మాణానికి విరాళ మిచ్చారన్నారు. రెడ్లు, బలిజ కళ్యాణ మండపాలు హైకోర్టు స్టేలతో నడుస్తున్నాయన్నారు. ఏనాడైనా ప్రభుత్వం వాటిని కూలగొడుతుందన్నారు. నిజంగా ఆ కులస్తులకు మేలు చేయాలనుకుంటే రాచమల్లు ఆక్రమించిన ఎస్సీ భూములను వారికి కేటాయించాలన్నారు. రామేశ్వరంలోని మునిస్వామి ఆలయ అభివృద్ధికి రూ.40 లక్షలు ఎంపీ గ్రాంట్ ఇప్పిస్తామన్నా ఎమ్మెల్యే ఒప్పుకోలేదన్నారు. అభివృద్ధిపై ఆయన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. అభివృద్ధి నిరోధకుడు రాచమల్లును ఘోరంగా ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు ,ఖలీల్ పాల్గొన్నారు.

తనిఖీల పేరుతో వేధించడం తగదు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 22: తనిఖీల పేరుతో పోలీసులు ప్రజలను, వ్యాపారులను వేధించడం తగదని ది ప్రొద్దుటూరు షరాబు మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పర్తి మధుసూదన్ తెలిపారు. సోమవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రావడానికి చాలా సమయం ఉన్నా తనిఖీలు నిర్వహిస్తుం డటంతో ప్రజలు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెళ్లిళ్లకు ఆభరణాలు కొనడానికి, వ్యాపారాల కోసం పట్టణానికి వస్తుంటారని, తనిఖీల పేరుతో వారి డబ్బును స్వాధీనం చేసుకుని తిరుపతి ఆదాయపన్ను శాఖ వారికి అప్పగించడం తగదన్నారు. ఎన్నికల సంఘం ఉద్దేశం ఒక విధంగా ఉంటే కింది స్థాయి సిబ్బంది నిర్వాకం మరో విధంగా ఉందన్నారు. ఆభరణాలు కొనుగోలు చేసి దుకాణం నుంచి బయటకు రాగానే తనిఖీలు నిర్వహించి ఆభరణాలు, డబ్బు సీజ్ చేయడం దారుణమన్నారు. దీని వల్ల పెళ్లిళ్లు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఒకటి, రెండు లక్షల రూపాయలను కూడా సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగిస్తుండటంతో ఆ డబ్బు తిరిగి తెచ్చుకోవడానికి సామాన్య ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతారన్నారు. పోలీసులు పట్టుకున్న సొమ్ముకు ఆధారాలు చూపినా సీజ్ చేయడం అన్యాయమని తెలిపారు. ప్రజల అవసరాల కోసం తెచ్చుకునే డబ్బుకు, ఎన్నికల కోసం ఉపయోగించే డబ్బుకు తేడాను అధికారులు గుర్తించాలన్నారు. తనిఖీలపై అధికారులు ముందస్తుగా విస్తృత ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించి ఉంటే బాగుండేదని తెలిపారు. పోలీసు తనిఖీలపై త్వరలో ఎన్నికల సంఘాన్ని, డీజీపీకి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ చలపతి, జాయింట్ సెక్రటరీ మహేష్ కుమార్ పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధికి పుట్టా విరాళం

ఖాజీపేట, జనవరి 22: మండల పరిధిలోని పత్తూరు గ్రామంలో సీతారాముల ఆలయ నిర్మాణానికి మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రూ.2.50 లక్షలు విరాళం ఇచ్చారు. ఆ విరాళాన్ని మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి ఆలయ కమిటీ మెంబర్లకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చినాయుడు, పుల్లయ్యనాయుడు, రమణ, సంజీవరాయుడు, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

95 కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన మురళీధర్ రెడ్డి వర్గ నాయకులు

ముద్దనూరు జనవరి22: మండల పరిధిలోని యామవరం గ్రామంలో వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గానికి చెందిన ఒంటికొమ్ము మురళీధర్‌రెడ్డి, ఆయన వర్గానికి చెందిన దాదాపు 95 కుటుంబాలు సోమవారం రాత్రి జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. భూపేష్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, జంభాపురం రమణారెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధరాత్రి మహిళల అరెస్టులు అన్యాయం


బద్వేలులో రెండు చేతులు పైకెత్తి నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

మైదుకూరు, జనవరి 22 : తమకు మద్దతుగా సేకరించిన సంతకాలను సీఎంకు అందించేందుకు విజయవాడకు వెళ్తున్న మహిళలను అర్ధరాత్రి అని చూడకుండా అరెస్టు చేసినందుకు నిరసనగా ఈనెల 24న రాష్ట్ర వ్యాప్త బంద్ నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తల జేఏసీ నాయకులు శివకుమార్, శ్రీరాములు, ఏవీ శివరాయి తెలిపారు. సోమవారం వారు మైదుకూరులో మాట్లాడుతూ మైదుకూరు నుంచి వెళ్తున్న మహిళలను మల్లెపల్లెలో అరెస్టు చేసి మైదుకూరు డీఎస్పీ కార్యాలయానికి తరలించారన్నారు. బుధవారం నిర్వహించే రాష్ట్ర వ్యాప్త బంద్‌కు సహకరించాలని కోరారు.

బద్వేలు రూరల్: అంగన్వాడీ కార్యకర్తలతో అనుచితంగా ప్రవర్తించిన బి.కోడూరు ఎస్ఐ జయరాములును సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని మాట్లాడారు. విజయవాడకు వెళుతున్న అంగన్వాడీ కార్యకర్తల బస్సును గుంటూరు సమీపంలో అడ్డుకుని బద్వేలుకు తీసుకవస్తున్న క్రమంలో మహిళలను కనీసం మూత్రవిసర్జనకు కూడా బస్సు దిగ నివ్వకుండా పోలీసులు తీవ్ర వత్తిడి చేశారన్నారు. దీంతో రాధమ్మ, రత్నమ్మ అనారోగ్యంపాలు కాగా ఆసుపత్రికి తరలించకుండా పోలీసుస్టేషన్‌కు తీసుకు వెళ్లారన్నారు. "ఎస్ఐ జయరాములును సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో ఆందోళ న చేస్తామని హెచ్చరించారు. ఖదీరయ్య ఆధ్వర్యంలో చేతులు పైకెత్తి నిరసన తెలిపారు.

బద్వేలు: స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ తమ గోడు చెప్పుకునేందుకు విజయవాడకు వస్తే ముందస్తు అరెస్టు చేయడం బాధాకరమన్నారు.

కొండాపురం: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు 42వ రోజు నిరసన ను కొనసాగించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు తారాదేవి, వరలక్ష్మి పాల్గొన్నారు

పోరుమామిళ్ల: అంగన్వాడీలను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలరు రమణారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

జమ్మలమడుగు: అంగన్వాడీల సమస్యలపైప్రభుత్వం చలించకపోవడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ విమర్శించారు. ఎక్కడికక్కడ ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ సమస్యకు సంబంధించి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలన్నారు. పట్టణ కార్యదర్శి తులసీశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోపవరం: అంగన్వాడీలను విధుల నుంచి తొలగిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కదీరయ్య అన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం కరుణించి వారికి తగిన న్యాయం చేసి ఆదుకోవాలన్నారు.

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీలను అడ్డుకోవడాన్ని నిరసిస్తు అంగన్‌వాడీలు రూరల్ పోలీసు స్టేషన్ వద్ద అంగన్‌వాడీలు బైఠాయించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ టర్మినేట్ ఆర్డర్స్ ఇవ్వడం ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దె దించి ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపుతారన్నారు. జగన్ అవినీతి పై పోరాటం జరిపి జైల్లో పెట్టిస్తామని హెచ్చరించారు.